## క్లుప్తంగా

### పూర్తి సమాచారంతో హాజరు కావాలి



మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ అంజిరెడ్డి

కొత్తపట్నం: మండలంలో శుక్రవారం జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారాంతో హాజరు కావల్సిందిగా ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో స్పందన సమావేశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ కలెక్టర్ దినేష్ కుమార్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాలు మేరకు స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని రకాల అర్జీలు పరిష్కరిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు అక్కడే పరిష్కరించే విధంగా అధికారులు సిద్ధం కావాలన్నారు. వారి చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూస్, మత్స్యశాఖ, వైద్యం, ఇరిగేషన్, ఎన్‌ఆర్‌జీఎస్, వెలుగు, నాడు-నేడు, పంచాయతీ రాజ్ శాఖ, పశుసంవర్ధక శాఖ వంటి శాఖల అధికారులతో చర్చించారు. గ్రామాల్లోకి వెళితే నాకు ఈ సమస్య ఉందని చెప్పకూడదని చెప్పారు. నాలుగున్నర ఏళ్లల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమాచారం మీ వెంట తీసుకురావాలని కోరారు. ఎంపీడీవో పి.సుజాత, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, డాక్టర్ శివపార్వతి, వంశీకృష్ణారెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్షఫీజు గడువు పొడిగింపు

ఉలవపాడు: ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు గడువు తేదీని పొడిగించినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జిలానీబాషా తెలిపారు. ప్రథమ సంవత్సరం, ద్వితీయసంవత్సం విద్యార్థులు ఈ నెల 11 లోగా ఫీజు చెల్లించవచ్చని తెలియచేశారు. రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 29 వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు, ఫెయిల్ అయిన విద్యార్థులు, చదువు మానేసిన వారంతా ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరుకావాలన్నారు.

### ఐటీఐ కళాశాలలో ఉచిత శిక్షణ

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎంకేవీవై 4.0 పథకం ద్వారా మూడు నెలల అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ (కంప్యూటర్) ఉచిత శిక్షణ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీహెచ్ హర్షవర్ధన్ తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువత పది, ఆపై అర్హత ఉన్న నిరుద్యోగులకు స్వల్ప కాలిక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎస్‌ఎస్‌సీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటోతో కళాశాలలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 8185955585, 9182491072, 9177460894 నంబర్లను సంప్రదించాలన్నారు.

### మిరప తోటల్లో నీటిని బయటకు పంపాలి



ఎడ్లూరపాడులో మిరప తోటలను పరిశీలిస్తున్న ప్రత్యూష

జరుగుమల్లి: మిరప తోటల్లో నిలిచిన వర్షం నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలని ఉద్యానవన శాఖాధికారి డి.ప్రత్యూష సూచించారు. మండల పరిధిలోని ఎడ్లూరపాడులో మిరప తోటలను ఆమె గురువారం పరిశీలించారు. మిరప తోటల్లో 19:10:19; యూరియా వేయాలని, అంతర సేద్యం చేసి నేల ఆరేలా చూసుకోవాలన్నారు. ఎండు తెగులు, ఆకుమచ్చ తెగులు, బూజు తెగులు నివారణ చర్యలను వివరించారు. ఆమె వెంట వీఏఏ వెంగమాంబ ఉన్నారు.

**ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలి**

టంగుటూరు: పొగాకు సాగు చేసిన రైతులు ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్థానిక వేలం కేంద్రం పరిధిలోని మల్లవరప్పాడు గ్రామంలో పొగాకు పంట నియత్రణ, ఆవశ్యకత, పొగాకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీట మునిగిన పొగాకు పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పొగాకు నాటిన 15 రోజుల్లోగా ఫారం-2ను, క్యూరింగ్ తర్వాత వచ్చిన పొగాకు పరిమాణం గురించి ఫారం-3ని బోర్డు కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్జీఓ సిద్దరాజు, పొగాకు బోర్డు సిబ్బంది, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

జే.పంగులూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో గురువారం రోటరీ భవనంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి 97 మంది హాజరుకాగా, వీరిలో 62 మందికి కంటి శుక్లా ఆపరేషన్లు చేయాలని వైద్యులు నిర్ధారించారు. 62 మందికి శంకర్ కంటి వైద్యశాలకు ప్రత్యేక బస్సులో గురువారం మధ్యాహ్నం తరలించారు. ఈ సందర్భంగా ఆప్తాలమిక్ అధికారి డాక్టర్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషికి కళ్లు ఎంతో ప్రధానమైనవని, కంటి చూపు లేకపోతే ఈ ప్రపంచాన్ని చూడలేమని అన్నారు. వైద్యులు శివచెన్నయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

# జగనన్నే మళ్లీ సీఎం కావాలి



ఒంగోలు: మాట్లాడుతున్న రాయపాటి అంకయ్య

మద్దిపాడు: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. గురువారం కీర్తిపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ప్రసంగించారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడిన వ్యక్తి కాబట్టి జగనన్నే ముఖ్యమంత్రిగా కావాలని అట్టడుగు వర్గాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అర్హులైన పేదలందరికీ పార్టీ వర్గ ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, సీనియర్ నాయకుడు గుడ్డపాతల రవి,కృష్ణా రెడ్డి జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, సర్పంచ్‌లు మల్లీశ్వరి గ్రామ సర్పంచ్ తిప్పారెడ్డి కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఒంగోలు టౌన్: దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయపాటి అంకయ్య చెప్పారు. నగరంలోని 9వ డివిజన్‌లో గురువారం జగనే ఎందుకు కావాలి, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రులు తాత్కాలిక ప్రయోజనం కలిగించే పథకాలను మాత్రమే చేపట్టారని కానీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మాత్రం ప్రజల జీవితాలకు దీర్ఘకాలికంగా మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను సైతం ఉచితంగానే అందజేస్తున్నారని చెప్పారు. అలాగే మన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్ది వారి జీవితాలను ఉజ్వలంగా తీర్చిదిద్దేందుకు ఇంగ్లిషు మీడియంతో పాటు అనేక మార్పులను తీసుకొని వచ్చారన్నారు. నాడు నేడు ద్వారా స్కూళ్ల రూపు రేఖలు మార్చడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరిగేలా అనేక విప్లవాత్మక చర్యలను తీసుకున్నారని చెప్పారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో ఒంగోలు నగరం అభివృద్ధి చెందుతుందని కార్పొరేటర్ వెన్నపూస శోభా వెంకటరెడ్డి అన్నారు. 9వ డివిజన్ అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. సంక్షేమ పథకాలకు 34 కోట్ల 25 లక్షల రుపాయలు, అభివృద్ధి కోసం 7.31 కోట్ల రుపాయలను ఖర్చు చేసినట్లు చెప్పారు. సువర్ణ, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం**

మదనూరు (కొత్తపట్నం): సీఎం వైస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు పెట్టారు కాబట్టే మనమంతా అభివృద్ధి చెందామని అందుకు జగనే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి అన్నారు. మదనూరు సచివాలయం-1 పరిధిలో జగనే మరళ ఎందుకు సీఎం కావాలంటే అనే కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సచివాలయం పరిధిలో నాలుగున్నర సంవత్సరాల చేసిన అభివృద్ధి, సంక్షేమ బోర్డును సచివాయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తరువాత ప్రతి కుటుంబానికి ఏదో ఒక స్కీమ్ వర్తించి ఆర్థికంగా ఎదిగారన్నారు. సచివాలయం పరిధిలో నాలుగున్నర సంవత్సరాల్లో రూ.29.93 కోట్లు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేశామన్నారు. ఇంత అమౌంట్ వారి అకౌంట్‌లో జమ చేయటం ఇదే మొదటి సారిగా చూస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ పింఛన్ పథకం పెంపు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, అమ్మ ఒడి వంటి పథకాలు పెట్టాడు కాబట్టే మళ్లీ సీఎం జగనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు ద్వారా ఎన్నో రకాల సేవలు అందుతున్నాయని అంతా ఉపయోగించుకోవాలని సూచించారు. నోడల్ ఆఫీసర్ ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య రూ.29.93 కోట్లు సంక్షేమ పథకాల బోర్డు చదివి వినిపించారు. అనంతరం ఆయూష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ పంచాయతీ కార్యదర్శులు ఆర్. శ్రీనివాసరావు, ఎం. ఉమామహేశ్వరి, కన్వీనర్ కోటేశ్వరరావు, ఏసురత్నం, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, వీవోఏలు పాల్గొన్నారు.



మదనూరులో బోర్డు ఆవిష్కరిస్తున్న దృశ్యం



పట్టికను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

# పథకాలపై అవగాహన



యరజర్లలో ఇన్సూరెన్స్ కార్డులు అందిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, ఎంపీడీవో



సర్వేరెడ్డిపాలెంలో మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీడీవో

ఒంగోలు రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం ఒంగోలు రూరల్‌లోని సర్వేరెడ్డిపాలెంలో జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై గ్రామప్రస్తుల్లో అవగాహన కోసం వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి సర్వేరెడ్డిపాలెంలో కార్యదర్శి భాగ్యలక్ష్మి, గ్రామ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ భూపాల్‌రెడ్డి కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీడీవో పి.అజిత, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, వ్యవసాయాధికారి కిషోర్‌బాబు, మండలస్థాయి అధికారులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కాకుమాని ఆదిశేషయ్య, కార్యదర్శి పసుపులేటి భాగ్యలక్ష్మి మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వ పథకాలైన స్వామిత్ర, జన్‌ధన్ యోజన, జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, ఆయుష్మాన్ భవ, వందే భారత్, అమృత భారత్ రైళ్ల గూర్చి, దీనదయాల్ యోజన గూర్చి వక్తలు వివరించారు.

యరజర్ల గ్రామంలో వికసిత్ భారత్ కార్యక్రమానికి సర్పంచ్ టి.రాములమ్మ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంపీటీసీ పల్లపోలు మల్లిఖార్జునరెడ్డి, ఎంపీడీవో పి.అజిత, ఎంపీటీసీ శ్రీనివాసరావు, కరవది పీహెచ్‌సీ డాక్టర్ వాణి, ఏవో అగ్రికల్చర్ కిషోర్‌బాబు, ఏపీఎం గోపినాథ్, హౌసింగ్ ఏఈ పృథ్వీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహిధర్‌రెడ్డి, ఈవోఆర్డీ రమణమ్మ, ఏవో శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం సంయుక్తంగా అమలు చేస్తున్న పథకాలను గూర్చి ఈ సందర్భంగా వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ అర్హులైన వారందరూ కార్యక్రమంపట్ల అవగాహన పెంచుకోవాలని దరఖాస్తు చేసుకుని పరిస్థితి మెరుగుపరుచుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు వీక్షించినవారు గ్రామస్తులకు కూడా తెలియజేయాలని ఎంపీడీవో కోరారు. ఆయుష్మాన్‌భారత్ గూర్చి కరవది పీహెచ్‌సీ డాక్టర్ వాణి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామం చేరుకున్న రథంలో ప్రధానమంత్రి మోదీ ప్రశంగాన్ని స్థానిక విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దశరాజుపల్లెలో సర్పంచ్ శ్రీలక్ష్మి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇంటింటికి కుళాయి, జలజీవన్ మిషన్ గూర్చి వివరించారు. డాక్టర్ వాణి అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల గూర్చి వివరించారు. ఎంపీడీవో ప్రస్తుతం అమల్లో ఉన్న కేంద్రప్రభుత్వ 16 పథకాలను క్రమమంగా వివరించారు. కార్యదర్శి రేవతి, మండల స్థాయి అధికారులు మాట్లాడారు.

ఒంగోలు సెంట్రల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉపయోగించుకోవాలని భారతీయ జనతా పార్టీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ అన్నారు. సర్వేరెడ్డి పాలెంలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహించారు. యోగయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రపంచంలో అజేయశక్తిగా నిలవడంపై ప్రధాన మోదీ సేవలను కొనియాడారు. పేద, బడుగు వర్గాల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. పార్లమెంటు కన్వీనర్ సెగ్గం శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి బొద్దిలూరి ఆంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్ యాదవ్, మూడో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు గ్యాస్ మంజూరు పత్రం అందిస్తున్న నాయకులు

# బూచేపల్లి ట్రస్ట్ ద్వారా మధ్యాహ్న భోజనం



భోజనం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఇంటర్ విద్యార్థులకు బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించే మధ్యాహ్న భోజనాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గురువారం ప్రారంభించారు. తమ ట్రస్ట్ నుంచి ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. పేద పిల్లలకు సేవ చేసుకునే భాగ్యం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.జవహర్, కాలేజీ ప్రిన్సిపాల్ ఆలీబాబా, కౌన్సిలర్లు ఇందిర, కాజ పాల్గొన్నారు.

## కౌమార దశలో జాగ్రత్త



మాట్లాడుతున్న జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: కౌమార దశలో బాలికలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అవగాహన కల్పించారు. గురువారం చీమకుర్తిలోని బీవీఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలతో పాటు శారీరక పరిపక్వత, రక్తహీనత వంటి పలు సమస్యలపై స్థానిక డాక్టర్‌లు లక్ష్మీశారద, సంధ్య వివరించారు. అనంతరం జేవీవీ ఆధ్వర్యంలో జవహర్ ఆస్పత్రిలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉచిత ఓపీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు డాక్టర్ బి.జవహర్, లయన్స్‌క్లబ్ జిల్లా నాయకులు చలువాది బదరీనారాయణ, చలువాది రమేష్, కాలేజీ ప్రిన్సిపాల్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకోవాలి

ఉలవపాడు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఎంతఓట రమణయ్య, సర్పంచ్ సుధారాణి అన్నారు. రామాయపట్నం, వీరేపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం బాలికల విద్య కోసం ఎన్నో పాఠశాలలు నెలకొల్పడం, వాటిని ఎక్కువనిధులు అందచేస్తుందన్నారు. మహిళా సంక్షేమం పట్ల ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధను గుర్తించి అన్ని రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పీఎంవై కార్డులను అందచేశారు. ఎంతఓట రమణయ్య, వ్యవసాయాధికారి తిరుమలజ్యోతి, ఏపీఎం నవీన్, సర్పంచ్ వెంకటసుధారాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతురాజు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

# పశువులకు వ్యాధులు సోకే అవకాశం



పశుపోషకులకు ఆరోగ్య సంరక్షణ కార్డులు అందిస్తున్న డాక్టర్ బేబిరాణి

ఒంగోలు రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కలుషితమైన నీరు పారుతోంది. ఈ నీరు తాగితే పశువులు, గొర్రెలు, మేకలకు గొంతువాపు, జబ్బవాపు, చిటుకవ్యాధి మొదలైన అంటు వ్యాధులు ప్రబలి ఆయా పశువులు, జీవులు చనిపోయే అవకాశం ఉందని పశుసంవర్ధక శాఖ అధికారి బేబిరాణి తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. గురువారం రూరల్‌లోని కరవది గ్రామీణ పశు వైద్యశాలలో గురువారం నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యాధి నిరోధక టీకాలు ప్రభావిత గ్రామాలన్నింటిలో పశు వైద్యాధికారుల వద్ద ఉండేలా చర్యలు తీసుకున్నామని ఎలాంటి కొరతలేదని స్పష్టం చేశారు. 75 శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశుపోషకులకు పశుఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేశారు. 245 గొంతు వ్యాధి, 65 సాధారణ చికిత్సలు, 92 లేగదూడలకు నట్టల నివారణ మందులు, 16 గర్భకోశ వ్యాధి నిర్ధారణ చికిత్స అందించారు. కరవది సర్పంచ్ డి.కోటేశ్వరరావు, ఒంగోలు డివిజనల్ ఉపసంచాలకులు ఎ.రమేషబాబు, త్రోవగుంట సహాయసంచారకులు డాక్టర్ భసవశంకరరావు, ఉలిచి పశువైద్యాధికారి ఐ.ప్రతిమ, కరవది డీఎల్‌వో కె.లక్ష్మయ్య, ఒంగోలు రూరల్ పశువైద్యాధికారి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రాంతాల పరిశీలన



మత్స్యకార కుటుంబాలకు సాయం అందిస్తున్న వీఆర్వో, నాయకులు



నగదును అందిస్తున్న ఒంగోలు తహసీల్దార్

ఒంగోలు రూరల్: మండలంలోని తుఫాన్ ప్రభావిత గ్రామాలను ఒంగోలు తహసీల్దార్ పి.మురళి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల కార్యదర్శులతో, వీఆర్‌వోలతో మాట్లాడారు. గ్రామాల్లో పశువులు కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోవడం వలన అంటువ్యాధులు వేగంగా ప్రబలుతాయని ఫలితంగా మృత్యువాత పడతాయన్నారు. ఆ పరిస్థితి రాకుండా పశుసంవర్ధకశాఖ అధికారులకు తెలిపి గ్రామాల్లో పశువైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొత్త నీరు వచ్చిన నేపథ్యంలో టైఫాయిడ్ డైయేరియా తదితర అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని శుక్ర, శనివారాల్లో ఫ్లోరినేషన్ రోడ్ల వెంబడి బ్లీచింగ్ కార్యక్రమం, చెత్త కుంపలను తొలగించే కార్యక్రమాలను చేపట్టాలను కార్యదర్శులను, వీఆర్‌వోలను ఆదేశించారు. అనంతరం ఒంగోలులోని సత్యసాయి పాఠశాలల్లో పునరావాస కేంద్రంలో ఉన్న 84 కుంటుంబాలవారికి ప్రభుత్వం విడుదల చేసిన కుంటుంబానికి రూ.2500 తహసీల్దార్ పంపిణీ చేశారు. తహసీల్దార్‌తో పాటు స్థానిక కార్పొరేటర్ ఎస్.భాస్కర్‌రెడ్డి, డీటీ ఫిరోజ్‌భాష, ఒంగోలు కార్యలయ సిబ్బంది పాల్గొన్నారు.

**తుఫాన్ బాధితులకు సాయం అందజేత**

నాగులుప్పలపాడు: మించాంగ్ తుఫాన్ వలన ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశాలు అందాయి. అలాగే పునరావాస బాధితులకు ఇంటికి వెళ్ళేటప్పుడు వారికి అవసరమైన సరుకులతో పాటు ప్రతి కుటంబానికి ఆర్థిక సాయం అందించడంలో భాగంగా అధికారులు చర్యలు చేపట్టారు. నాగులుప్పలపాడు మండలంలోని కనపర్తి తీరప్రాంత గ్రామాలైన బీచ్ పల్లెపాలెం గ్రామానికి చెందిన మత్స్యకార కుటుంబాలను కనపర్తిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారమే వారిని ఇంటికి పంపించే క్రమంలో పునరావాస కేంద్రంలో ఉన్న 13 కుటుంబాల వారికి ఒక్కో కుటుంబానికి రూ.2500 చొప్పున గురువారం ప్రభుత్వం తరుపున వీఆర్వో హనోక్, పార్టీ నాయకులు త్రినాథ్ రెడ్డి అందజేశారు.

# మంత్రి ఆదేశాలతో రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేయకముందు రోడ్డు పరిస్థితి



మరమ్మతులు చేసిన తరువాత సాఫీగా ఉన్న రోడ్డు

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదేశాలతో స్థానిక త్రిపురాంతకం రోడ్డుకు అధికారులు గురువారం మరమ్మతులు చేపట్టారు. ఈ రోడ్డులో ఏర్పడిన గుంతలతో రాకపోకలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో త్రిపురాంతకం రోడ్డులో వాహనాలపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేయవచ్చంటూ మంత్రికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



## గంధ మహోత్సవం ప్రారంభం

పామూరు: పట్టణంలోని సీఎస్‌పురంరోడ్డులో ఉన్న హజరత్ మహబూబ్ సుబాని దర్గా 47వ గంధ మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ఈసందర్భంగా దర్గాలో పలువురు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని మొక్కులు తీర్చుకుని ముజావర్ల దీవెనలు పొందగా, గంధ మహోత్సవంలో హిందూ, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాను ప్రత్యేక విద్యుద్దీపాలంకరణలో సుందరంగా తీర్చదిద్దారు. భక్తులకు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సెగ్రింగ్‌చాంద్‌బాషా, దాతల సాయంతో అన్నదానం ఏర్పాటు చేశారు. పలువురు నాయకులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



గంధ మహోత్సవంలో దర్గావద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు, నాయకులు

# మాజీమంత్రి పులి వెంకటరెడ్డికి ఘన నివాళి



వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

కనిగిరి రూరల్: దివంగత కేంద్ర కార్మిక శాఖ మాజీ మంత్రి పులి వెంకటరెడ్డి వర్ధంతిని గురువారం కనిగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పులి వెంకటరెడ్డి పార్కులో పులి వెంకటరెడ్డి మనుమరాలు మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, గోవర్ధన్‌రెడ్డి దంపతులు, పులి లక్ష్మి, కౌన్సిలర్ దేవకి రాజీవ్ పులి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాకు పులి వెంకటరెడ్డి ఎన్నో సేవలు అందించారన్నారు. పులి నాగేంద్ర, రుద్ర, సంధాని, మాన్సూర్ పాల్గొన్నారు.